# నిరుద్యోగాన్ని, ఉపాధిలేమిని పెంచిపోషిస్తున్న కేంద్ర–రాష్ట్రప్రభుత్వాలు

**దేశంలో** భూమి సమస్య – ఉపాధి సమస్య ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉన్నాయి. 68 సంవత్సరాల 'స్వతంత్ర' భారతావనిలో ఈ రెండు సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. ఇప్పటి వరకు దేశాన్ని పాలించిన ఏ పాలకపార్టీ ఈ సమస్యలను పరిష్కరించే విధానాలు అమలుపర్చలేదు. ఫలితంగా గ్రామీణ పేదరికం, నిరుద్యోగం ఆంజనేయుడి తోకలా పెరుగుతూ వస్తున్నది. 2011 సంవత్సరం జనాభా గణాంకాల ప్రకారం దేశంలో 12 కోట్లమంది నిరుద్యోగులు ఉన్నారు. 2004–05 సంవత్సరంలో 15–24 సం॥ మధ్య వయస్సుగల చదువుకొన్న విద్యార్థులు 3 కోట్లమంది ఉంటే, 2013 నాటికి వారి సంఖ్య 14 కోట్లకు చేరుకొంది. వీరిలో ప్రతి సంవత్సరం 30 లక్షలమంది విద్యావంతులైనవారు (డిగ్రీలు పొందినవారు) నిరుద్యోగుల జాబితాలో చేరుతున్నారు. 20 నుంచి 34 సం॥ మధ్య వయస్కుల్లో సగంమంది ఉద్యోగ అన్వేషణలో ఉన్నారంటే నిరుద్యోగ తీవ్రత అర్థమౌతుంది. ప్రభుత్వ ఉద్యోగం అన్నది దేశంలో ఒక ఎండమావిగా మారింది.

ప్రపంచంలో ఏదేశంలో లేనంతగా భారతదేశ జనాభాలో 70%మంది యువతీ యువకులు ఉన్నారు. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం ప్రదర్శించారు. అందుకువారి వర్గస్వభావమే కారణం. భూస్వాముల, సామ్రాజ్యవాదుల, బడాపెట్టుబడిదారుల దోపిడీ ప్రయోజనాలను పెంపొందించే విధానాలను అమలు జరుపుతున్న ఫలితంగా పేదరికం – నిరుద్యోగం భయానక స్థితికి చేరుకొన్నాయి. గ్రామీణ – పట్టణ పేదరికానికితోడు పట్టాలు పుచ్చుకొన్న విద్యావంతులు నిరుద్యోగుల్లో 19.4 శాతంగా ఉన్నారు. అంటే ప్రతి ముగ్గురు పట్టభద్రుల్లో ఒకరు నిరుద్యోగిగా మిగిలిపోతున్నారన్న మాట!

ప్రతి ఎన్నికల సందర్భములోనూ పేదరికాన్ని తగ్గిస్తామని, ఉద్యోగ–ఉపాధి అవకాశాలు కల్పిస్తామని దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన అన్ని పాలకపార్టీలు అరచి వాగ్దానం చేశాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. గత సాధారణ ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి, రాష్ట్రంలో టిడిపి కూటమి తిరిగి ఇదే పల్లవితో ముందుకు వచ్చాయి. గత యుపిఏ పాలకుల విధానాల ఫలితంగానే దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిందని తాము అధికారంలోకి వస్తే పేదరికాన్ని, నిరుద్యోగాన్ని రూపుమాపుతామని ఉపన్యాసాలతో ఊదరగొట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రతి ఇంటిలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. ఉపాధి లభించక నిరుద్యోగంతో నిరాశా, నిస్పృహలకు లోనైన యువత ఆ మాటలకు ఆకర్షించబడ్డారు.

ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచి కేంద్రంలో ఎన్‌డిఏ కూటమి, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. ఈ ప్రభుత్వాలైన ఉద్యోగం, ఉపాధికల్పిస్తాయన్న ఆశతో ఉన్న యువతకు నిరాశే ఎదురైంది. నిరుద్యోగ యువతను ఏమార్చేందుకు విదేశీ పెట్టుబడులు, పరిశ్రమలు అంటూ విదేశీ పర్యటనలకు కేంద్ర, రాష్ట్ర పాలకులు శ్రీకారం చుట్టారు. ఉపాధి కల్పనను విదేశీ బడా పారిశ్రామికవేత్తల దయాదాక్షిణ్యాలకు వదిలేశారు. జాతీయత, జాతీయ విధానాలను వల్లించిన బిజెపి అసలు రంగు బహిర్గత పర్చుకొన్నది. సామ్రాజ్యవాదుల సేవలో యుపిఏ ప్రభుత్వం కన్నా వడవడిగా పరుగులు పెడుతున్నది. దేశంలోని అన్నిరంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నది. ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మివేయటం లేదా మూసివేసి కార్మికుల ఉపాధిని హరించి, వారిని వీధిపాలు చేస్తున్నది.

అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం కోటి ఉద్యోగాలు ఇస్తామంటూ ఎన్నికల్లో నరేంద్రమోడీ వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని గాలికొదిలేశాడు. సంఘటితరంగం లేక ప్రైవేట్ రంగం, దేనిలోనైనా నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరుగుతూ ఉంది. దేశ లేబర్ బ్యూరో జరిపిన సర్వే ప్రకారం 2014–15 సంవత్సరంలో మూడవ త్రైమాసికంలో దేశ ఉపాధి వృద్ధి క్షీణించింది. 2014 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థలోని ఎనిమిది కీలకరంగాల్లో 1.17 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు సర్వే రిపోర్టు పేర్కొంది. ఆ సంవత్సరంలో మూడు త్రైమాసికాల్లో ఉద్యోగ అవకాశాలు క్షీణిస్తూ వచ్చాయి. ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో 1.82 లక్షల ఉద్యోగాలు లభించగా, జూలై–సెప్టెంబర్ నాటికి 1.58లక్షలకు పడిపోయింది. 2014–15 ఆర్థికసంవత్సరంలోని మూడు త్రైమాసికాల్లో ఇదే లెక్కన కల్పించబడ్డాయి. 2014–15 మొత్తం ఆర్థిక సంవత్సరంలో 5.40 లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించబడ్డా...వీటిల్లో ఎక్కువ భాగం ప్రైవేట్‌రంగంలోనే ఉన్నాయి. నిరుద్యోగం పెరుగుదలను దృష్టిలో పెట్టుకొంటే, కేంద్రప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలు నామ మాత్రమేనన్నది స్పష్టం. ప్రతి సంవత్సరం పని వెతుక్కొంటూ వచ్చే శ్రామికులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రతి సంవత్సరం 1.2 కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది.

2014–15 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి రేటు 7.4 శాతంగా ఉందని, ఇది అనుకొన్న దానికన్నా ఎక్కువని ఎన్‌డిఏ ప్రభుత్వం చెబుతున్నది. దేశ అభివృద్ధి రేటు పెరిగిందని చెబుతున్న ప్రభుత్వం, ఉపాధి కల్పనా రేటు క్షీణించటాన్ని చెప్పటం లేదు. ఆర్థికాభివృద్ధి రేటు ఎక్కువగా ఉంటే ఉపాధికల్పన కూడా ఎక్కువ ఉండాలి. అందుకు విరుద్ధంగా ఉపాధి కల్పన ఉంది. 2004 నుండి 2009 వరకు యుపిఏ ప్రభుత్వ పాలనలో స్థూలజాతీయోత్పత్తి(జీడీపీ) 8 శాతం కంటే ఎక్కువగా ఉంది. అది 9.3 శాతానికి కూడా చేరుకొంది. దీనికి అనుగుణంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగ కల్పన జరగాల్సి ఉంది. కాని అలా జరగలేదు. కొద్దిమంది పారిశ్రామిక

వేత్తల, సంపన్నుల ఆదాయాలు పెరుగుదలనే ఆర్థిక అభివృద్ధి సూచికగా ప్రభుత్వం చెప్తున్నది. అదే దేశాభివృద్ధి అంటున్నది. ఈ ఆర్థిక అభివృద్ధి పేదల ఆర్థిక – జీవన పరిస్థితులను పెంచలేదు. వారికి ఉపాధి అవకాశాలను కల్పించటంలేదు.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు బాగా పెరగటం వలన గ్రామీణ ప్రజలు వ్యవసాయం నుండి వైదొలగి ఇతర రంగాల ద్వారా ఉపాధి పొందేందుకు నగరాలకు, పట్టణాలకు వలసలు పోతున్నారని, ఇది వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి సూచికగా కొందరు ప్రచారం చేయటం వాస్తవాన్ని చూడ నిరాకరించటమే. పాలకుల విధానాల ఫలితంగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, డీజల్ ధరలు పెరుగుతూ రైతాంగానికి సేద్యపు ఖర్చు మోయలేని భారంగా మారింది. పెరుగుతున్న సేద్యపుఖర్చులకు అనుగుణంగా పంటలకు న్యాయమైనధరలు లభించక నష్టపోయి చిన్న, సన్నకారు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి, అవి తీర్చేందుకు ఉన్న భూమి అమ్ముకొంటున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేక దాన్ని వెతుక్కుంటూ పట్టణాలకు, నగరాలకు వలస పోతున్నారు. ఈ సంక్షోభాన్ని వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధిగా చెప్పటం సమస్యను ప్రక్కదారి పట్టించటమే. 2005–09 సం॥లో మధ్యలో 14 కోట్ల మంది ప్రజలు వ్యవసాయాన్ని వదలిపెట్టారని ప్రణాళికా సంఘం జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ఇలా వ్యవసాయాన్ని వదలి వెళ్లిన వారందరూ వస్తు తయారీ పరిశ్రమల రంగంలోకి ప్రవేశిస్తున్నారని చెప్పేది అవాస్తవమైనదే. ఇప్పటికే పరిశ్రమల్లో పనిచేస్తున్న 5.3కోట్లమంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. పరిశ్రమల్లో ఉపాధి–ఉద్యోగాలు తగ్గిపోతుంటే, వ్యవసాయాన్ని వదలి ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్న గ్రామీణ ప్రజలకు వాటిల్లో ఉద్యోగ – ఉపాధి ఎలా లభిస్తుంది? అలా వెళ్లినవారు సంఘటిత రంగంలో కాకుండా రోజువారీ కూలీలుగా, అపార్ట్‌మెంట్ల వద్ద వాచ్‌మెన్‌లగా దొరికీ దొరకిని ఉపాధితో నికృష్ట జీవితాలు గడుపుతున్నా రనటంలో సందేహంలేదు. 2007లో 3.7 కోట్లమంది భారతరైతులు వ్యవసాయాన్ని వదలి నగరాలకు వలస వెళ్లారని 'క్రిసిల్' అనే ప్రపంచ స్థాయి విశ్లేషణ సంస్థ తాజా అధ్యయనంలో వెల్లడైంది. గతరెండు సంవత్సరాల కాలంలో అలా వలస వెళ్లిన రైతుల్లో 1.5 కోట్లమందికి ఉపాధి అవకాశాలు లభించక గ్రామాలకు తిరిగిపోయారని ఆ సంస్థ అంచనా వేసింది. మిగిలినవారు దొరికీ, దొరకని ఉపాధితో అవమాన కరమైన, దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. వారు కూడా గ్రామాలకు తరలివెళతారనటంలో సందేహంలేదు.

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 14లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయటం లేదు. రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఉద్యోగాల భర్తీకి ఆర్థిక అంశాన్ని కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు సాకు చెబుతున్నాయి. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయకపోవటం ప్రపంచబ్యాంక్ సూచనలకు అనుగుణంగానే జరుగు తున్నది. ఉద్యోగుల సంఖ్యను సాధ్యమైనంత తగ్గించి వేతనాల క్రింద యిచ్చే నిధుల వినియోగాన్ని తగ్గించు కోవాలని ప్రపంచబ్యాంక్ పాలకులకు సూచించింది. దాన్ని వారు అమలు జరుపుతున్నారు.

ఉద్యోగ అవకాశాలు లభించని యువత, స్వయం ఉపాధి పొందుదామనుకున్నా వారికి ఆచరణలో అది సాధ్యపడటం లేదు. అందుకు వారి కుటుంబ పరిస్థితులే కారణం. ప్రభుత్వాలనుండి కూడా సహకారం అందటం లేదు. ఉద్యోగాలు లభించని యువత ఆలోచనలు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మారకుండా ప్రక్కదారి పట్టించే విధంగా ప్రధానమంత్రి గ్రామీణ ఉపాధి కల్పన పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు దాన్ని అమలు పర్చిన తీరు ఆ పథకాన్ని కూడా నీరుగార్చే విధానాలకు అద్దం పడుతున్నాది. దానికి కేటాయించిన నిధులు, కల్పించిన ఉపాధి అందుకు నిదర్శనం.

2008–09 సం॥నుండి 2014–15 వరకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం అమలు తీరును పరిశీలిద్దాం.

**ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం అమలు**

| సంవత్సరం | సబ్సిడీ (రూ. కోట్లలో) | యూనిట్లు (లక్షల్లో) | ఉపాధి |
|---|---|---|---|
| 2008–09 | 356 | 19,166 | 2.04 |
| 2009–10 | 762 | 40,918 | 4.24 |
| 2010–11 | 891 | 44,064 | 4.88 |
| 2011–12 | 1,057 | 55,135 | 4.95 |
| 2012–13 | 1,050 | 57,878 | 4.28 |
| 2013–14 | 1,075 | 58,493 | 3.78 |
| 2014–15 | 4.28 | 18,141 | 1.38 |

(ఆధారం:ఈనాడు 13-11-2015)

గత ఏడు సంవత్సరాల కాలంలో ఈ పథకానికి 6,369 కోట్లు మాత్రమే కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించి, 5,652 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఈ పథకం ద్వారా 4కోట్ల మంది దరఖాస్తు చేసుకోగా 2.89లక్షల మందికి మాత్రమే రుణాలు అందాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో 50వేల మందికి పైగా దరఖాస్తు చేసుకోగా నాలుగోవంతుకు కూడా రుణాలు అందలేదు. ఈ పథకం కూడా ఆచరణలో విఫలమైంది.

తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇంటికో ఉద్యోగం ఇస్తానని చేసిన వాగ్దానాన్ని అటకెక్కించింది. రాష్ట్రంలో దాదాపుగా కోటిమంది యువత ఉపాధి దొరక్క మానసిక క్షోభలో ఉన్నారు. కొత్తగా ఉద్యోగ కల్పన చేయకపోగా, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కూడా భర్తీ చేయటంలేదు. రాష్ట్రస్థాయిలో భర్తీచేయాల్సిన ఉద్యోగాలు లక్షా ఇరవైవేలు ఉన్నాయి. అందులో ఖాళీల వివరణలు ఈ విధంగా ఉన్నాయి. స్టేట్ కేటగిరిలోని గ్రూప్ -1లో 184, గెజిటెడ్ 29, ఎన్జీఓ 788, లోయర్ గ్రేడ్ 25; మల్టీజోన్‌లోని గ్రూపు-1లో 61, గెజిటెడ్ 699, ఎన్జీవో 428; జోనల్ స్థాయిలో గెజిటెడ్ 11,105, ఎన్జీఓ11,353, చివరిగ్రేడ్ 4; జిల్లాస్థాయిలో గ్రూపు-1, గెజిటెడ్ 863, ఎన్జీవో- 82,760 చివరి గ్రేడ్ - 22,519, ఎయిడెడ్ 8957, మొత్తం 1,42,825. వీటిని భర్తీచేయకపోవటం ప్రపంచ బ్యాంక్ సూచనల మేరకే అన్నది గమనించాలి.

తాజా సమాచారం ప్రకారం రాష్ట్రంలోని ఉపాధి కల్పనా కార్యాలయాల్లో నిరుద్యోగులుగా 8.29 లక్షల మంది నమోదై ఉన్నారు. సంవత్సరాల తరబడి వీరు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ఉపాధి కల్పనా కార్యాలయాల ద్వారా 10,120 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించగా అందులో ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం 1,408 మాత్రమే. వాటిలో కూడా ఎక్కువ భాగం కాంట్రాక్టు ఉద్యోగాలే.

రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఉపాధి, ఉద్యోగాలు కల్పించేందుకు సెజ్‌లు, వాన్‌పిక్‌లు, కోస్టల్ కారిడార్‌లు ఏర్పాటుచేసి దేశ, విదేశీ బడా పెట్టుబడిదారులకు పరిశ్రమలు ఏర్పాటు పేరుతో రైతుల నుండి బలవంతంగా భూములు సేకరించి కట్టబెడుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న విధంగా పెట్టుబడులు రావటం లేదు, పరిశ్రమలు ఏర్పాటు కావటంలేదు, ఉపాధి-ఉద్యోగ అవకాశాలు లభించటం లేదు. రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 1,06,552 పరిశ్రమ యూనిట్లు ఉన్నాయి. 2014-15 సం॥లో కొత్తగా వచ్చిన ప్రతిపాదనలు 2,847 మాత్రమే. ఇందులో అంతకుముందు సంవత్సరం వచ్చిన దరఖాస్తులే ఎక్కువ. 2015-16సం॥లో కొత్త పరిశ్రమల సంఖ్య మరింతగా తగ్గాయి. పరిశ్రమల ఏర్పాటు ద్వారా 2020 నాటికి 15 వేల కోట్ల పెట్టుబడులను రప్పించి సంవత్సరానికి 3.5 లక్షలమందికి ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పగా 3 వేల కోట్లకు మించి పెట్టుబడులు రాలేదు. ఇందులోనూ 2 వేలకోట్లు రాష్ట్ర విభజనకు ముందు వచ్చిన ప్రతిపాదనలే ఉన్నాయి. ఈ ఆర్థికసంవత్సరంలో 958.16 కోట్ల పెట్టుబడిని రాబట్టి, 16,882 మంది మాత్రమే ఉపాధి పొందే ప్రతిపాదనలు ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వపాలనలో సెజ్‌ల ఏర్పాటు ద్వారా 16 లక్షల 78 వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి లక్షా 27 వేల ఎకరాలను బడా పారిశ్రామికవేత్తలకు పాలకులు కట్టబెట్టినా ఆచరణలో లభించిన ఉద్యోగాలు లక్షా, 13 వేలు మాత్రమే కల్పించబడ్డాయని వారే చెప్పారు. సెజ్‌ల ఏర్పాటు ద్వారా ఉపాధి పొందిన వారికన్నా, ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య ఎక్కువగా వుంది.

ప్రపంచబ్యాంక్‌కి ప్రధాన గుమస్తాగా పేరుపొందిన చంద్రబాబు, దాని సూచనలు, ఆదేశాలను తు.చ. తప్పకుండా అమలు పరుస్తున్నాడు. కొత్త ఉద్యోగాల నియామకాలు చేయకపోగా ఉన్న ఉద్యోగాలనే తగ్గించి వేస్తున్నాడు. తిరిగి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత 35వేల ఉద్యోగాలను తొలగించటం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖలో 1500మంది కాంట్రాక్టు కార్మికులను, ఉపాధి పథకంలో 2వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లను, గృహనిర్మాణశాఖలో 7వేలమంది వర్క్ ఇనస్పెక్టర్లను, 15 వేల మంది ఆదర్శ రైతులను, హాస్టల్స్‌లో పనిచేసే 300మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను తొలగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారనే పేరుతో తాజాగా 14 వేలమంది అంగన్‌వాడీ కార్యకర్తల తొలగింపుకి రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయటమూ అందులో భాగమే. పాఠశాల రేషనలైజేషన్‌లో భాగంగా కిలోమీటర్ పరిధిలో 30 మందికన్నా తక్కువ విద్యార్థులు ఉన్నారన్న పేరుతో 3500 పాఠశాలలను ఇతర పాఠశాలల్లో విలీనంచేయటం ద్వారా వేలాది ఉపాధ్యాయ ఉద్యోగాలను ప్రభుత్వం రద్దుచేసింది. రాజధాని నిర్మాణం ద్వారా 10 లక్షల మందికి ఉద్యోగ-ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, శిక్షణకు వెళ్లిన 126 మందికి కూడా ఉద్యోగాలు కల్పించలేకపోయింది. అభ్యర్థులు మధ్యలోనే తిరిగి వచ్చి సి.ఆర్.డీ.ఏ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

నిరుద్యోగసమస్య పరిష్కారానికి సరైన విధానాలు అమలు పర్చకుండా రైతుల భూములను పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతూ ఉపాధి - ఉద్యోగ కల్పనలను వారి దయాదాక్షిణ్యాలకు పాలకులు వదలి వేస్తున్నారు.

ఉద్యోగ-ఉపాధి కల్పన అన్నది సరైన దిశలో దేశం పారిశ్రామికవంతం అయినప్పుడు మాత్రమే సాధ్యమౌతుంది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగినప్పుడే పరిశ్రమల అభివృద్ధి జరుగుతుంది. పరిశ్రమలు ఏర్పడితేనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మనది వ్యవసాయక దేశం కావటం, నూటికి 68శాతం ప్రజలు గ్రామాల్లో ఉండటం వలన వారి ఆర్థిక-జీవనప్రమాణాలు మెరుగుపడటం, పారిశ్రామిక అభివృద్ధికి ఎంతో కీలకం. అలా జరగాలంటే కేంద్రకరించబడ్డ భూసంబంధాలను బ్రద్దలు కొట్టి గ్రామీణ పేదలకు భూపంపిణీ జరగాలి. అప్పుడు మాత్రమే వారి ఆర్థికపరిస్థితి పెరిగి అవసరాలు తీర్చుకోగలగటం జరుగుతుంది. అందుకు అనుగుణంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలు తీర్చే పరిశ్రమలు నెలకొల్పాలి. ప్రజావ్యతిరేకమైన దళారీ పాలకులు ఇలాంటి విధానాలు అమలుపర్చరు. గ్రామీణ - పట్టణ పేదలు - విద్యార్థులు, నిరుద్యోగులు సమైక్యంగా ఉద్యమించి నూతన ప్రజాతంత్ర వ్యవస్థను సాధించుకొన్నప్పుడే అది సాధ్యం.

ooooo